క్లుప్తంగా

ఎంబ్రాయిడరీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు ఎంబ్రాయిడరీ నేర్చుకొనేందుకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు ఆధార్‌కార్డుతో సంగారెడ్డి బైపాస్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ నెల 14న శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రచార వేగాన్ని పెంచండి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ప్రచారాన్ని వేగవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, నాయకులు భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. మాణిక్‌రావు గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు శివశంకరయ్యస్వామి, సత్యనారాయణ, నాగిశెట్టి, శివరాజ్, శ్రీనివాస్, ఇసాంపటేల్, మక్సూద్ మియా, ముస్తఫా, శివుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు' ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

హత్నూర(సంగారెడ్డి): తొలిమెట్టు కార్యక్రమ ప్రగతిపై ఆయా పాఠశాలల తీరుపై బుధవారం హత్నూర, దౌల్తాబాద్ జెడ్పీహెచ్ పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, కంద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు, విషయ వారి సోపానాల ఆధారంగా బోధన చేయాలని సూచించారు. అనంతరం మండల ఎఫ్ఎల్ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలు భాషా సామర్థ్యాలను సంఖ్యా భావనలు పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్పీలు వై.నర్సింహులు, సీఆర్పీలు పద్మారావు, శ్రావణి, యాదగిరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఏడు లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెంలోని కిరాణాదుకాణంలో సాయిబాబు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్‌ఐ మల్లయ్య సిబ్బందితో కలిసి దుకాణంపై దాడి చేసి ఏడు లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

షెడ్డు నిర్మాణం తొలగింపు



షెడ్డును తొలగిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న రైస్‌మిల్లు అదనపు షెడ్డు నిర్మాణాన్ని అధికారులు బుధవారం తొలగించారు. రైస్‌మిల్లుకు పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఇటీవల తన భూమిని ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. దీంతో స్పందించిన జహీరాబాద్ డీఎల్పీఓ రాఘవరావు, ఎంపీఓతో కలిసి బుధవారం షెడ్డు నిర్మాణాన్ని కొలతలు చేసి అదనంగా స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. దీంతో రైస్‌మిల్లు నిర్వాహకులను ఆదేశించి షెడ్డును తొలగించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జాకీర్, శ్రీనివాస్, ధనరాజ్, శివశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో గొల్ల, కురుమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపావళి, సదర్ సమ్మేళనానికి తేదీలను ఖరారు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దీపావళి 12న సదర్ సమ్మేళనం, 14న నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ ఏడాది సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఊరెళ్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా వనం చిన్నాను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పదేళ్లలో వందేళ్ల ప్రగతి

- మేనిఫెస్టోలను అమలుచేయని చరిత్ర కాంగ్రెస్ పార్టీది: ఎమ్మెల్యే గూడెం
- ప్రజల మనిషి మహిపాల్‌రెడ్డి: కాసాని



నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో వందేళ్ల ప్రగతిని సాధించామని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రతీ కార్యకర్త గడపగడపకు వెళ్లి పదేళ్ల ప్రగతిని వివరించి 'కారు' గుర్తుపై ఓటు వేయించాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. గురువారం ఉదయం 11 గంటలకు రుద్రారం గణేష్‌గడ్డ దేవాలయంలో పూజలు నిర్వహించి నామినేషన్ వేయబోతున్నట్లు తెలిపారు. మతం పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ నాయకులు, వాళ్ళ రాజకీయ జీవితంలో ఏనాడైనా ఒక గుడికి సున్నం వేశారా? అని ప్రశ్నించారు. రంగురంగుల కరపత్రాలు, మోసపూరిత హామీలతో మేనిఫెస్టోను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసిందా అని నిలదీశారు. పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే జీఎంఆర్, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు అడిగే నైతిక హక్కు కేవలం బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో రూ.9 వేల కోట్లతో పటాన్‌చెరును అభివృద్ధికి నిదర్శనంగా నిలిపామన్నారు. ప్రతీ గ్రామానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించి ప్రజల అవసరాలు, ఆకాంక్షల అనుగుణంగా అభివృద్ధి పనులు చేయడంతో పాటు ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకగ్రీవ మద్దతు అందిస్తూ బీఆర్‌ఎస్ పార్టీని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. లక్ష మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అటు రాష్ట్రంలో, ఇటు పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల మాదిరిగా పరుగెడుతున్నాయన్నారు. ప్రతీ గడపకు పార్టీ హామీలను వివరించాలని సూచించారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని 40 ఏళ్లుగా చూస్తున్నానని, ఆయనది ప్రజల కోసం కష్టించే మనస్తత్వమన్నారు. మహిపాల్ రెడ్డి విజయం ఎప్పుడో ఖరారైందని, మెజార్టీయే మిగిలిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం మొత్తం బీఆర్‌ఎస్ పార్టీ వెన్నంటే ఉందన్నారు. ఈ 20 రోజులు ప్రతీ కార్యకర్తకు అత్యంత కీలకమని, ప్రతీ ఓటరును వ్యక్తిగతంగా కలిసి కారు గుర్తుకు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించాలని కోరారు. అనంత రం బొల్లారం, పటాన్‌చెరు డివిజన్‌కు సంబంధించిన పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, మూడోసారి కూడా పటాన్‌చెరు ఎమ్మెల్యేగా మహిపాల్ రెడ్డి విజయం సాధిస్తారని, పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిలర్ నవనీత అన్నారు. బుధవారం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ ఎస్ఎస్ఎల్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.



ఎస్ఎస్ఎల్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ నవనీత, నాయకులు



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు

రాజకీయాల్లో యువత కీలకపాత్ర పోషించాలి

పటాన్‌చెరు: నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు బంగారు తెలంగాణ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీకి చెందిన యువకులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతీ విజయంలో యువత భాగస్వామ్యం కీలకమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, గూడెం సంతోష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డికి మద్దతుగా బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహించారు. బుధవారం మున్సిపాలిటీలోని గాంధీనగర్, బీరప్ప బస్తీ, శ్రీరామ్‌నగర్‌లలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. గూడెం మహిపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు నిహారిక, గోపాలమ్మ, చంద్రయ్య, స్థానిక నాయకులు, మా అంబి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో వడ్డెరల అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ నాయకత్వంలో వడ్డెరల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వడ్డెరల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన అనంతరం అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ వేల కోట్లు కేటాయిస్తున్నారన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం అశోక్‌నగర్‌లో ఆక్సిలరీ కార్మికుల సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, శంకర్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వడ్డెరల ఆత్మీయ సమ్మేళనంలో మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కె.మాణిక్ రావు అన్నారు. బుధవారం మండలంలోని బర్దిపూర్, పొట్టిపల్లి, మాచ్నూర్, కుప్పానగర్, కక్కర్ వాడ, చిలపల్లి, సిద్దాపూర్, వనంపల్లి, బోజనాయక్ తండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు, దేవాలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్‌ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరా రు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ముందుకు వస్తోందని ప్రజలు గమనించాలన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రజలకు భరోసా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సుభా ష్‌రావు, నాయకులు కృష్ణ, హఫీజ్, సిద్ధన్న పాటిల్, షేక్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి గెలిపించాలని కోరుతూ సదాశివపేట పట్టణంలోని రహమత్‌నగర్, ఫయాజ్‌నగర్ కాలనీలలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పట్నం సుభాష్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ఎప్రచారం నిర్వహించారు, కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మైనార్టీల మద్దతు

కోహీర్(జహీరాబాద్): మైనార్టీ ముస్లిం మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందని టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్ అన్నారు. కోహీర్ పట్టణంలోని ఎస్ఎన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ ముస్లిం అభివృద్ధికి ప్రభుత్వం మైనార్టీ బంధు ప్రవేశపెట్టిందన్నారు. అదేవిధంగా మైనార్టీ గురుకుల పాఠశాలలను నెలకొల్పిందని వివరించారు. హజ్ కమిటీ చైర్మన్ సలీం సాబ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌నాయక్



ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్‌నాయక్

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ జహీరాబాద్ నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌నాయక్ నియమితులయ్యారు.ఈ మేరకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్ కలిసి బుధవారం శ్రీనివాస్‌నాయక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో గిరిజన తండాల్లో బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ పునర్ నిర్మాణం



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని అనేగుంటలో కొలువైన పెద్దమ్మతల్లి దేవాలయాన్ని పునర్ నిర్మించి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముదిరాజ్ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రుణపడి ఉంటాం

ఆ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్‌లకు నాలుగు టికెట్లు కేటాయించిన కాంగ్రెస్‌కు రుణపడి ఉంటామని పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తొలిసారి గాంధీభవన్‌కు చేరుకున్న నీలం మధు ముదిరాజ్ ఏఐసీసీ పెద్దలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినందుకు ఏఐసీసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఏఐసీసీ పెద్దలు, నీలం మధు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట తెల్లాపూర్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పెద్దకంజర్ల మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పటాన్‌చెరు పట్టణ ఉపాధ్యక్షుడు శేఖర్, అమీన్‌పూర్ కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్, సీనియర్ నాయకులు అన్వర్‌పటేల్, అబ్దుల్ ఖాదర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గణేష్‌గడ్డ ఆలయంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుద్రారం, లక్డారం, చిట్కుల్, ముత్తంగి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సహదేవ్, పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరేశం, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సంగారెడ్డిలోని శిశుమందిర్ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

గ్యారంటీలను అమలుచేస్తాం

జోగిపేట (అందోల్): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహ అన్నారు. జోగిపేట క్లాక్ టవర్ వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం జోగిపేట మున్సిపాలిటీలోని ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కౌన్సిలర్‌లు ఆకుల సత్యనారాయణ, సురేందర్‌గౌడ్, రంగ సురేష్, హరికష్ణగౌడ్, డాకూరి శివశంకర్, నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, డాకూరి శ్రీనివాస్, వెంకటేశం, రాములు, మధు, రాజు, శరత్‌బాబు, రామకృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

సొంతగూటికి...

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు యూనూస్‌ఖాన్ ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం రాత్రి జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. యూనూస్‌ఖాన్‌తో పాటు మరికొందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇందిరానగర్ కాలనీలో వైద్యశిబిరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలోని బస్తీ దావఖానలో బుధవారం తెల్లాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడు పెరుగు శ్రీధర్‌యాదవ్ సహకారంతో టీబీ నివారణకు ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జయం నివారణ సంస్థ, టీబీ అలర్ట్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజేశ్వరి, శ్యామ్, టీబీ అల్లర్ సంస్థ ప్రతినిధులు పురుషోత్తం, కృష్ణ, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, గ్రామస్తులు రాజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎక్స్‌రే పరీక్షలను చూపుతున్న వైద్యులు

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

నారాయణఖేడ్: కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నారాయణఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఓటరు చైతన్యర్యాలీ నిర్వహించారు. ఓటింగ్ శాతం పెరగడానికి గాను కళాకారులతో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్: ఈ నెల 27న పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. అరుణాచలం, వేలూరు, కాణిపాకం, జోగులాంబను దర్శించుకుని వచ్చేలా సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రానుపోను రూ.4,300 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9959223170, 9441071134 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తూము కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని బీమ్లా పంచాయతీ టౌర్య తండాలో దాత రమేశ్‌రెడ్డి సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చారు. అందుకు సంబంధించి ఆలయ నిర్మాణ భూమి పూజ బుధవారం చేశారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కార్మికుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ముత్తంగి గ్రామానికి చెందిన పెంటయ్య(43) ఎంఎస్ఎన్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం పరిశ్రమలో విధులు ముగించుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంతారానికి దామోదర రాక

మునిపల్లి(అందోల్): ఈ నెల 9న అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులను దర్శించుకోవడానికి కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవతామూర్తులను దర్శించుకున్న అనంతరం నామినేషన్ వేస్తారని తెలిపారు.